
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 36.0 । కనిష్ఠం : 27.0
ANDHRAJYOTHY
5
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
గురువారం 23 మే 2024



ప్రేమ పేరుతో మోసం

» పోలీసులను ఆశ్రయించిన యువతి

ఆత్మకూరు, మే 22: ప్రేమ పేరుతో తనను మోసం చేశారని ఓ యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆత్మకూరు ఎస్ఐ నరేందర్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు పట్టణానికి చెందిన రమేష్, మూల మల్ల గ్రామానికి చెందిన ఓ యువతి ప్రేమించుకున్నారు. రమేష్ ప్రేమిస్తున్నానంటూ ఆ యువతితో శారీరక సంబంధం పెట్టుకున్నాడు. పెళ్లికి నిరాకరించడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. కాగా, రమేష్‌కు ఇది వరకే వివాహమైంది.

- » స్కూల్ యూనిఫామ్స్ గతంలో కొలతలు లేకుండానే కుట్టు
- » దాంతో కొందరికి బిగుతుగా.. మరికొందరికి లూజుగా..
- » ఇబ్బందులు పడ్డ విద్యార్థులు
- » ఈ సారి మహిళా సంఘాలకు బాధ్యత
- » అన్ని పాఠశాలల్లో కొలతలు తీసుకున్నారని చెబుతున్న అధికారులు
- » చాలా పాఠశాలలకు రాలేదంటున్న ప్రధానోపాధ్యాయులు



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల స్కూల్ యూనిఫామ్స్(ఫైల్)

కొలతలతోనే.. కుట్టాలి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యార్థుల వివరాలు

జిల్లా	బాలికలు	బాలురు
మహబూబ్‌నగర్	34,218	37,471
నారాయణపేట	27,983	31,887
జోగులాంబ గద్వాల	31,421	34,214
నాగర్‌కర్నూల్	29,647	32,009
వనపర్తి	20,288	22,553

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మే 22: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే యూనిఫామ్స్ కొలతలు లేకుండా కుడుతున్నారని, దాంతో దుస్తులు కొందరికి లూజుగా, మరికొందరికి బిగుతుగా ఉంటున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. రెండు మూడు కొలతల ప్రకారం అందరికీ దుస్తులు కుడుతుండటంతో స్టూడెంట్స్ అసౌకర్యానికి గురవుతున్నారు. దాంతో ఏడాది పాటు వేసుకోవాల్సిన దుస్తులు రెండు మూడు నెలలకే చిరిగిపోతున్నాయి. ఈ కారణంగా ప్రభుత్వ ఉద్దేశం నెరవేరడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

పట్టించుకోని అధికారులు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల మధ్య పేద, ధనిక, కుల, మత తారతమ్యాలు లేకుండా ఉండేందుకు గవర్నమెంట్ అందరికీ ఒకే రకమైన యూనిఫామ్స్ అందిస్తోంది. ప్రతీ విద్యార్థికి ఏటా రెండు జతల యూనిఫామ్స్ ఇస్తోంది. పాఠశాల ప్రారంభమైన వెంటనే దుస్తులను ఇస్తున్నారు. అయితే కొలతల ప్రకారం కాకుండా నిర్లక్ష్యంగా కుట్టడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. సైజులు సరిపోక కొందరు విద్యార్థులు యూనిఫామ్స్ లేకుండా పాఠశాలలకు వెళ్తున్నారు. ఈ విషయమై విద్యాశాఖ అధికారులు దృష్టి సారించడం లేదు.

ఎమ్మార్సీలకు చేరుకున్న టెస్కో వస్త్రం

యూనిఫాంలు కుట్టేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న మండల వనరుల కేంద్రాలకు టెస్కో సంస్థ నుంచి వస్త్రం చేరుకుంది. పాఠశాలలోని విద్యార్థుల సంఖ్య, యూడైస్‌లో పేర్కొన్న సంఖ్య ఆధారంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థుల కొలతలు తీసుకొని, యూనిఫామ్ కుట్టాలి. ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీలు మహిళా సంఘాలకు కుట్టు పనిని అప్పజెప్పాల్సి ఉంది. అయితే కొందరు నిబంధనలకు విరుద్ధంగా మహిళా సంఘాలకు కాకుండా టైలర్స్‌కు, ఇతర కుట్టు కాంట్రాక్టర్స్‌కు కుట్టు పని అప్పజెపుతున్నారు. దాంతో వారు ప్రతీ విద్యార్థి కొలతల ఆధారంగా కాకుండా ఏవో రెండు మూడు కొలతల ప్రకారం విద్యార్థులందరికీ దుస్తులు కొడుతున్నారు. కుట్టు కూలీ జతకు రూ.100 ఇవ్వడం కూడా అందుకు కారణమని తెలుస్తోంది. కొలతలు లేకుండా దుస్తులు కుట్టడంతో కొందరికి వదులుగా, కొందరికి బిగుతుగా ఉంటున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. కొందరు మళ్లీ డబ్బులు ఖర్చు పెట్టుకుని సరి చేయించుకుంటున్నామని చెబుతున్నారు. అయినా సెట్ కాకుంటే కొత్తగా వస్త్రం కొనుక్కొని కుట్టిస్తున్నామని, దాంతో ఆర్థిక భారం పడుతోందని వాపోతున్నారు. అలా కాకుండా ఈ సారైనా పాఠశాలలు తెరిచాక విద్యార్థుల కొలతలు తీసుకుని యూనిఫామ్స్ కుట్టాలని కోరుతున్నారు.



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని యూనిఫామ్ వస్త్ర గోదాంను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ (ఫైల్)

తప్పనిసరిగా కొలతలు తీసుకోవాలి



గతంలో మాదిరిగా కాకుండా ఈ సారి తప్పనిసరిగా అన్ని పాఠశాలల్లో విద్యార్థుల కొలతలు తీసుకున్న తర్వాతే యూనిఫామ్స్ కుట్టాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. ప్రతీ పాఠశాలకు వెళ్లి, విద్యార్థుల కొలతలు తీసుకోవాలి. ఆ విషయాన్ని ప్రతీ ప్రధానోపాధాయుడు పర్యవేక్షించాలని సూచించాం.

– బైకాని బాలు యాదవ్, సీఎంవో, మహబూబ్‌నగర్

మహిళా సంఘాల ద్వారానే కుట్టించాలి



యూనిఫామ్స్ కుట్టేందుకు మహిళా సంఘాల సభ్యులు తప్పనిసరిగా పాఠశాలకు వెళ్లి విద్యార్థుల కొలతలు తీసుకోవాలని చెప్పాం. మహిళా సంఘాల సభ్యులు ఇప్పటికే అన్ని పాఠశాలలు తిరిగి, కొలతలు తీసుకున్నారు. ఎక్కడైనా తీసుకోకుంటే తీసుకోవాలని చెప్పాం. ఈ సారి డీఆర్‌డీఏ ద్వారా మహిళా సంఘాల సభ్యులు విద్యార్థుల యూనిఫామ్స్ కుడుతున్నారు.

– ఎ.రవీందర్, డీఈవో, మహబూబ్‌నగర్ జిల్లా

బెట్టింగ్.. బంగారు రాజులు

- » జోగులాంబ గద్వాల జిల్లాలో జోరుగా దందా
- » క్రికెట్ బెట్టింగ్‌లో ఓ ఎస్ఐ కుమారుడి కీలక పాత్ర
- » కార్లు, బైకులు, ప్లాట్ల పేపర్లు కుదువ పెట్టుకొని వడ్డీలకు డబ్బులు అందజేత
- » పోలీసుల అదుపులో నలుగురు యువకులు



గద్వాల క్రైం, మే 22: జోగులాంబ గద్వాల జిల్లాలో గత కొంతకాలంగా గప్‌చుప్‌గా ఉన్న యువత ఇప్పుడు మళ్లీ బెట్టింగ్‌లంటూ తమ జీవితాలను నాశనం చేసుకుంటోంది. గద్వాల జిల్లా కేంద్రంలో సోమవారం నలుగురు యువకులు ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతూ పోలీసులకు పట్టుపడిన విషయం తెలిసిందే. అందులో ఓ ఎస్ఐ కుమారుడు ఉండటంతో ఈ బెట్టింగ్ వ్యవహారం జిల్లా మొత్తం హాట్ టాపిక్‌గా మారింది. పట్టుపడిన వారిలో గద్వాలకు చెందిన అనిల్‌కుమార్, వడ్డేపల్లి మండలం శాంతినగర్‌కు చెందిన ఈశ్వర్, రాకేష్, నాగరాజు ఉన్నారు.

గద్వాల మండలానికి చెందిన ఓ వ్యక్తి నుంచి కారు, బైక్ స్వాహా..

గద్వాల మండలానికి చెందిన ఓ వ్యక్తి ఎస్ఐ కుమారుడి దగ్గర కారు, బైక్‌లు కుదువపెట్టి బెట్టింగ్‌లకు పాల్పడినట్లు తెలుస్తోంది. బెట్టింగ్‌లో అతను ఓడిపోవడంతో రెండు వాహనాలను కోల్పోయినట్లు సమాచారం. తర్వాత ఎస్ఐ కుమారుడికి డబ్బులు వాపస్ ఇచ్చి, వాహనాలు ఇవ్వాలని కోరగా అధిక వడ్డీకి అడిగినట్లు సమాచారం. దాంతో బాధితుడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బెట్టింగ్ బాగోతం వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఎస్ఐ కుమారుడిని పట్టుకొని తీగలాగితే డొంకంతా కదిలింది. వీరితో పాటు గద్వాల, వడ్డేపల్లికి చెందిన యువకులు, కొందరు రాజకీయ నాయకులు కూడా ఈ బెట్టింగ్‌లో ఉన్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది.

సూత్రధారి అయిజకు చెందిన వ్యక్తి



జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ ప్రధాన కేంద్రంగా బెట్టింగ్‌లు నడుస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో బెట్టింగ్‌లు నడుపుతూ పట్టుబడ్డ ప్రధాన వ్యక్తి మళ్లీ ఈ దందా నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యక్తి కింద అయిజకు చెందిన వారే దాదాపు 300 మంది ఉన్నారని, వారి ద్వారా జిల్లాలోని ప్రధాన ప్రాంతాలలో బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న నలుగురు యువకులు కూడా అయిజ గురువుకు చెందిన శిష్యులేనని సమాచారం. ఈ బెట్టింగ్ వ్యవహారం కొంత మంది పోలీసులకు తెలిసినా.. అయిజకు చెందిన ప్రధాన వ్యక్తి వారిని మేనేజ్ చేస్తున్నట్లు విమర్శలొస్తున్నాయి. క్రికెట్ బెట్టింగ్‌లో అయిజ మొదటి స్థానంలో ఉండగా గద్వాల రెండో స్థానంలో ఉన్నట్లు తెలుస్తోంది. అయిజకు చెందిన వ్యక్తి కేవలం గద్వాల జిల్లాలోనే కాకుండా రాష్ట్రంతో పాటు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలలో కూడా బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. మ్యాచ్, బంతిల వారీగా బెట్టింగ్‌లు కాస్తున్నారు. ఈ బెట్టింగులలో గెలిస్తే ఒకటికి పది రెట్లు డబ్బులు ఇస్తూ యువకులను ఆకర్షిస్తున్నారు. దాంతో యువకులు తమ దగ్గర డబ్బు లేకున్నా వాహనాలు, బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. మరికొందరు నూటికి ఎంత వడ్డీ అయిన సరే తెచ్చి బెట్టింగ్‌లో పాల్గొంటున్నారు. ఓడిపోతే కొందరు ఆత్మహత్యలు చేసుకుంటుండగా.. మరికొందరు అప్పులు తీర్చడానికి దొంగలుగా మారుతున్నారు.



బ్యాంకు ఖాతాను పరిశీలిస్తే మరిన్ని వివరాలు వెలుగులోకి..

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో సోమవారం క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతూ పట్టుబడిన వారిలో ఓ ఎస్ఐ కుమారుడి పాత్ర కీలకంగా ఉన్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. ఆ ఎస్ఐ కుమారుడు బెట్టింగ్‌లకు పాల్పడటంతో పాటు బెట్టింగ్‌లు కాసే వారికి కార్లు, బైక్‌లు, సెల్‌ఫోన్‌లు, ఇతర వస్తువులను తాకట్టు పెట్టుకొని డబ్బులు ఇస్తాడని పోలీసుల నిఘాలో తెలింది. ఎస్ఐ కుమారుడితో పాటు శాంతినగర్‌కు చెందిన మరో యువకుడు ఏకంగా ప్లాట్ల పేపర్లను పెట్టుకొని బెట్టింగ్ ఆడేవారికి వడ్డీలకు అప్పులు ఇస్తున్నట్లు విచారణలో బయటపడింది. వీరితో పాటు మరికొందరు బెట్టింగ్‌లో ప్రధాన పాత్ర పోషిస్తున్నారని సమాచారం. పట్టుపడిన వారిలో అనిల్‌కుమార్ తప్ప మిగతా ముగ్గురు బెట్టింగ్‌లతో పాటు నిత్యం పేకాట ఆడుతున్నట్లు తెలుస్తోంది. ఎస్ఐ కుమారుడి బ్యాంక్ ఖాతాను పరిశీలిస్తే ఇంకా ఎంతమంది బెట్టింగ్ రాయుళ్లు ఉన్నారో తెలిసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. మిగతా ముగ్గురు కూడా వడ్డేపల్లి మండలంలో భారీగా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

ఎవరినీ ఊపేక్షించేది లేదు



ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమింగ్‌ల వల్ల ఎంతోమంది జీవితాలు నాశనం అవుతున్నాయి. బెట్టింగ్‌ల జోలికి పోయి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు. యువత బెట్టింగ్‌లకు దూరంగా ఉంటేనే ఉన్నతంగా రాణిస్తారు. బెట్టింగ్‌లతో ఎంతో మంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు చదువుపై దృష్టిసారించి ఉన్నతంగా రాణించాలి. గద్వాల జిల్లాలో బెట్టింగ్‌లు నిర్వహించే వారిపై నిఘా ముమ్మరం చేసాం. బెట్టింగ్‌లకు ప్రోత్సహిస్తున్న వారు, నిర్వహిస్తున్న వారు ఎంతటివారైనా ఊపేక్షించం. చర్యలు తీసుకుంటాం.

– రితిరాజ్, ఎస్పీ, జోగుళాంబ గద్వాల

తల్లీకూతుళ్ల ఆత్మహత్య

» పురుగుల మందుతాగి అఘాయిత్యం » భూ తగాదాలే కారణం



తల్లీకూతుళ్లు వరలక్ష్మి, అనురాధ(ఫైల్)

మానవపాడు, మే 22 : భూ సమస్యల కారణంగా తల్లీ, కూతురు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటుచేసుకున్నది. ఈ ఘటన గురించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మానవపాడు మండలంలోని ఏ బూడిదపాడు గ్రామానికి చెందిన మాల నరసింహులు, ఆయన సోదరులు ముగ్గురికి కలిపి రెండు చోట్లు భూమి ఉండేది. ఈ భూములు వారసత్వంగా వచ్చినవి. నరసింహులుకు ఇచ్చిన భూమి పట్టా భూమిగా ఉన్నది. మరో సర్వే నెంబర్ భూమి సీలింగ్ భూమిగా ఉండటంతో సోదరులతో వాదనలు జరిగేవి. ఈ మధ్యకాలంలోనే పట్టా భూమిని అమ్ముకున్నారు. కానీ, అమ్మకంతో వచ్చిన డబ్బును తమకు ఇవ్వలేదని నరసింహులు భార్య వరలక్ష్మి(39), కూతురు అనురాధ (18) మనస్తాపానికి గురయ్యారు. భూమి విషయంలో సోదరులు తనను మోసం చేస్తున్నారని కుటుంబం మొత్తం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకొని మంగళవారం సాయంత్రం నరసింహులు ఇంటి బయట ఎవరైనా ఉన్నారో చూసివస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఇంతలో భార్య వరలక్ష్మి, కూతురు అనురాధ పురుగుల మందు తాగేశారు. నరసింహులు ఇంట్లోకి వచ్చేలోపే వారిద్దరూ కింద పడిపోయి కనిపించారు. వారి అరుపులతో చుట్టుపక్కన ఉన్న ఇళ్లవారు వచ్చి వెంటనే కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదేరాత్రి వారిద్దరూ మృతి చెందారు. ఒకేసారి తల్లీకూతురు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అనురాధ ఇంటర్ చదివింది. కుమారుడు భాస్కర్ హైదరాబాద్‌లో డిగ్రీ పూర్తి చేశాడు. వారి ఉన్నతచదువుల కోసం ఆర్థికంగా లేకపోవడం, భూమి అమ్మిన డబ్బు సోదరులు ఇవ్వకపోవడంతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని, పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బాధిత కుటుంబ సభ్యులకు అందించినట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు.

ప్రోత్సాహం కరువు

- » చెంచు రైతులకు మూడేళ్లుగా నిలిచిన ఉచిత విత్తనాల సరఫరా
- » దుక్కిదున్నించడం కూడా..
- » పంటల సాగులో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు
- » ప్రభుత్వం సాయం చేయాలని వేడుకోలు



ఈర్ల పెంటలో ఓ చెంచు రైతు పొలం

మన్ననూర్, మే 22: సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ద్వారా చెంచు రైతులకు వ్యవసాయంలో మూడేళ్లుగా ప్రోత్సాహం కరువైంది. గతంలో చెంచు ఉపాధి హామీ పథకంలో భాగంగా ట్రాక్టర్లతో భూములను చదును చేయించేవారు. ప్రస్తుతం ఆ పథకాన్ని జనరల్ ఉపాధి హామీ పథకంలో చేర్చారు. దాంతో అటు పశువులు లేక, ట్రాక్టర్ల ద్వారా దున్నించుకునేందుకు ఇటు ఆర్థిక స్తోమత లేక భూములు సాగు చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరో మూడు రోజుల్లో రోహిణి కార్తె ప్రారంభం కానుంది. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా ఇదివరకే తొలకరి వర్షాలు కురవడంతో మైదాన ప్రాంతాల్లో ఉన్న రైతులు భూములను చదును చేసుకుని, పంటలు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. గత 15 రోజుల్లో నల్లమల చెంచు పెంటల్లో నాలుగైదు పర్యాయాలు భారీ వర్షాలు కురిశాయి. కానీ వ్యవసాయంపై ఆసక్తి ఉన్న మన్ననూరు ఐటీడీఏ పరిధిలో గల అమ్రాబాద్, పదర, బల్మూరు, లింగాల, పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్ మండలాల్లోని మారుమూల లోతట్టు ప్రాంతాల రైతులు పంటల సాగుకు ఎలాంటి ఏర్పాట్లు చేసుకోలేదు. నల్లమల ప్రాంతంలోని మల్లాపూర్, అప్పాపూర్, సంగిడి గుండాల, మేడిమొల్కల, ఈర్ల పెంట, రాంపూర్, భౌరాపూర్, పుల్లాయపల్లి తదితర పెంటల్లో చెంచులకు సుమారు రెండు వేలకుపైగా ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. ఆ భూముల్లో మొక్కజొన్న, జొన్నలు, రాగులు సాగు చేస్తుంటారు.

వ్యవసాయ అధికారి పోస్టు ఖాళీ

ఐటీడీఏ కార్యాలయంలో ఉండే వ్యవసాయాధికారి పోస్టు ఇప్పుడు లేదు. దాంతో సాగులో చెంచులకు సాయం చేసేవారు కరువయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సున్నిపెంటలో ఐటీడీఏ ఉండేది. అప్పట్లో పూర్తి స్థాయి అధికార యంత్రాంగం ఉండేది. ప్రత్యేక వ్యవసాయ అధికారి ఉండి చెంచుల వ్యవసాయంపై దృష్టి సారించేవారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఐటీడీఏను మన్ననూరుకు మార్చారు. అయితే పదేళ్లుగా ఐటీడీఏ పీవో పోస్టుతో పాటుగా ప్రత్యేక వ్యవసాయ అధికారి పోస్టును ప్రభుత్వం భర్తీ చేయడం లేదు.

2019 నుంచి కరువైన సాయం

చెంచుల భూములను సీసీడీపీ పథకంలో ట్రాక్టర్ల ద్వారా దున్నించడం, విత్తనాలను పంపిణీ చేయడాన్ని ఐటీడీఏ 2019 నుంచి నిలిపేసింది. అయినప్పటికీ వ్యవసాయంపై మక్కువ ఉన్న కొంత మంది చెంచులు ఉపాధి పనులు చేయగా వచ్చిన కూలీ డబ్బులు, అటవీ ప్రొటక్షన్ వాచర్లుగా ఉంటూ వచ్చిన వేతనంతో పంటలు సాగు చేస్తున్నారు. ట్రాక్టర్ల ద్వారా భూములు దున్నించుకుని విత్తనాలు వేస్తున్నారు. ఐటీడీఏ అధికారులు స్పందించి, వ్యవసాయం చేసుకునేందుకు గతంలో మాదిరిగా సహకారం అందించాలని రైతులు కోరుతున్నారు.

విత్తనాల కోసం నివేదిక పంపించాం

రైతు బంధు పథకం, కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా చెంచులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డబ్బులు ఇస్తున్నాయి. అందుకే ఉచితంగా విత్తనాల సరఫరాను ఐటీడీఏ నిలిపేసింది. చెంచు ఉపాధి హామీ పథకాన్ని జనరల్ ఉపాధి హామీ పథకంలో కలిపేయడంతో ట్రాక్టర్ల ద్వారా పొలాలు ఉచితంగా దున్నించడం నిలిచిపోయింది. ఈ యేడాది వానాకాలంలో చెంచులకు ఐటీడీఏ ద్వారా విత్తనాలు సరఫరా చేసేందుకు లబ్ధిదారుల జాబితాను తయారు చేసి, గిరిజన సంక్షేమ శాఖ కార్యాయలానికి నివేదిక పంపించాం.

– ఎండీ జాఫర్ హుసేన్, ఐటీడీఏ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్

దుక్కి దున్నించాలి



మాకు వ్యవసాయం చేయాలని ఉంది. కానీ కాడెద్దులు లేక దుక్కి దున్నుకోవాలంటే ఇబ్బందిగా ఉన్నది. ట్రాక్టర్లతో భూమి దున్నించాలంటే డబ్బులు లేవు. గతంలో మాదిరిగా ఐటీడీఏ దుక్కులు దున్నించి, విత్తనాలు అందించాలి.

– నిమ్మల నాగయ్య, మేడిమొల్కల పెంట

ఎద్దులు, వ్యవసాయ పనిముట్లు ఇవ్వాలి



గతంలో అటవీ ఉత్పత్తులు ఎక్కువగా ఉండేవి. ఇప్పుడు లేవు. ఉపాధి హామీ పనులు తప్ప మాకు మరో మార్గం లేదు. ఉపాధి హామీలో ఇచ్చే డబ్బులు మా జీవనోపాధికి సరిపోవడం లేదు. రైతు బంధు ద్వారా వచ్చే డబ్బులు కూలీల చెల్లింపులకే సరిపోతున్నాయి. దుక్కిని ఐటీడీఏ వారు ట్రాక్టర్లతో దున్నించాలి. లేదంటే ఎద్దులను, వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేయాలి.

– నిమ్మల లింగమ్మ, ఈర్ల పెంట

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

» ఉండవల్లి మండలం మారమునగాల-1 గ్రామంలో ఘటన




గొల్ల రమేష్(ఫైల్)

ఉండవల్లి, మే 22 : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండల పరిధిలోని మారమునగాల-1 గ్రామంలో ఈ సంఘటన జరిగింది. హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపిన వివరాలలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గొల్ల రమేశ్ (34), నాగరాజు మంగళవారం సాయంత్రం కాలినడకన పొలానికి బయలుదేరారు. అదే దారిలో వేముల నరసింహకు చెందిన పొలం దగ్గరున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మెరుపులు వస్తున్నాయి. దీనిని గమనించిన గొల్ల మద్దిలేటి అనే వ్యక్తి విద్యుత్ శాఖ ఏఈ శివకు ఫోన్ చేసి, విద్యుత్ సరఫరాను నిలిపివేయాలని కోరాడు. లైన్‌మెన్ చెప్తేనే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన సమాధానమిచ్చారు. ఇది జరిగిన కొద్దిసేపటికి నాగరాజు, రమేశ్ అదే దారిలో నడుచుకుంటూ వస్తున్నారు. నాగరాజు ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతడిని కాపాడే యత్నంలో రమేశ్ కూడా విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలో పడిపోయాడు. నాగరాజు ఎడమ చేతికి తీవ్ర గాయమైంది. సంఘటనా స్థలానికి కొద్ది దూరంలో ఉన్న గొల్ల మద్దిలేటి గమనించి వారి కుటుంబసభ్యులు, గ్రామస్థులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని రమేశ్‌ను కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తన భర్త మృతికి విద్యుత్ శాఖ అధికారులే కారణమని ఆరోపిస్తూ భార్య సునిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవం

అమ్రాబాద్, మే 22 : పదర మండలంలోని రామాలయ, ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని విశ్వహిందూ పరిషత్ ప్రఖండ కామిశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. అభిషేకాలు, యజ్ఞం నిర్వహించి శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువును జరిపారు. 50 ఏళ్ల క్రితం లక్ష్మాపూర్ ఆలయంలో ఉన్న ఉత్సవ విగ్రహాలను పదర ఆంజనేయ స్వామి ఆలయానికి వితరణ చేయగా, అట్టి విగ్రహాలతో కామిశెట్టి కుటుంబం వారు లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. కల్యాణోత్సవం అనంతరం తీర్థ ప్రసాదాలను భక్తులకు వితరణ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు సంభు వెంకట్‌రమణ, ఆర్యవైశ్య మహాసభ రీజినల్ చైర్మన్ జూలూరి సత్యనారాయణ, వికాస తరంగిణి సభ్యులు సంభు శోభ, అశోక్ కుమార్, జయమ్మ, ప్రభావతమ్మ, రామాంజనేయ భక్త బృందం పాల్గొన్నారు.



లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పోడు భూముల సమస్య పరిష్కరించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను కలిసిన చెంచు రైతులు



ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో పోడు భూముల సమస్యను విన్నవిస్తున్న చెంచు రైతులు

మన్ననూర్, మే 22 : పోడు భూముల సమస్యను పరిష్కారం చేయాలని కోరుతూ అమ్రాబాద్ మండలం మాచారం గ్రామానికి చెందిన చెంచు రైతులు బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను కలిసారు. రెండేళ్లుగా పోడు రైతులకు తమ భూముల్లో పంటలు సాగు చేసుకోకుండా అటవీ అధికారులు అడ్డుపడుతున్నారని, ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని 23 మంది చెంచు రైతులు ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే స్పందిస్తూ ఫోన్‌లో అటవీ శాఖ అధికారులతో మాట్లాడారు. గతంలో సాగు చేసుకున్న పోడు భూముల్లోనే పంటలు సాగు చేసుకోవాలని, కొత్తగా అడవులను నరికి భూములను చేసుకోవద్దని ఎమ్మెల్యే రైతులకు సూచించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుకు అనుమతించడంతో చెంచు రైతులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి రేణయ్య చెంచు రైతులు కాట్రాజు పెద్దిరాజు, ముత్యాలు, రాజు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మదనగోపాలస్వామి వివాహం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

పెంట్లవెల్లి, మే 22 : మండల పరిధిలోని జటప్రోల్ గ్రామంలో వెలసిన రుక్మిణి సత్యభామ సమేత శ్రీమదనగోపాలస్వామి కల్యాణోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మొదటగా స్వామి వారికి గణపతిపూజ, అంకురార్పణ, మహా మంగళహారతి, అనంతరం స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గురువారం సాయంత్రం 6గంటలకు స్వామి వారి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆదిత్య పేర్కొన్నారు.

ఉమామహేశ్వర క్షేత్రంలో గిరిప్రదక్షిణ

» 15 మంది శ్రీశైలం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పూజలు



పూజల్లో పాల్గొన్న చైర్మన్ కందూరి సుధాకర్, అర్చకులు

అచ్చంపేట, మే 22: నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట మండలం రంగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల శ్రీశైల ఉత్తర ద్వారంగా భాసిల్లుతున్న ఉమామహేశ్వర క్షేత్రంలో పూజారుల ఆధ్వర్యంలో బుధవారం గిరిప్రదక్షిణ, రుద్రాభిషేకం, అమ్మవారి సహస్ర కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీశైలం ఆలయంలోని 15 మంది అర్చకులు ఉమామహేశ్వరానికి వచ్చి భ్రమరాంబికా మల్లికార్జున స్వామి వారి పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ చైర్మన్ కందూరి సుధాకర్‌ను పూజారులు ఆశీర్వదించారు. ఆలయ ఈవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్య సంరక్షణ అందరి బాధ్యత

» డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అప్పియా చిన్నమ్మ



బొటానికల్ గార్డెన్‌లో విద్యార్థులు

మిడ్జిల్, మే 22 : జీవ వైవిధ్య సంరక్షణ అందరి బాధ్యత అని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అప్పియా చిన్నమ్మ అన్నారు. బుధవారం పట్టణంలోని డాక్టర్ బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో జీవ వైవిధ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సంస్కార్ ఎడ్యుకేషన్ స్కూల్ నుంచి తెలంగాణ బొటానికల్ గార్డెన్ వరకు విద్యార్థులతో జీవవైవిధ్య ర్యాలీ నిర్వహించారు. అనంతరం గార్డెన్‌ను విద్యార్థులు సందర్శించారు. గార్డెన్‌లోని వివిధ విభాగాలను గార్డెన్ సమన్వయ కర్త డాక్టర్ సదాశివయ్య వివరించారు. విద్యార్థులకు మొక్కలు ఎలా నాటాలి, విత్తనాలు ఎలా నాటారు అని ప్రాక్టికల్‌గా చేసి చూపించిన తరువాత విద్యార్థులు విత్తనాలు నాటారు. సర్ప అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు పాముల పట్ల అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. గార్డెన్‌లో విద్యార్థులు సీతా అశోక మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సంస్కార్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు సందీప్, రాధిక, పరిశోధక విద్యార్థి రమాదేవి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రాహుల్, మనీసా, అంకిత, లక్ష్మి, నవనీత్ పాల్గొన్నారు.

పాలిసెట్ పకడ్బందీగా నిర్వహించాలి

» చీఫ్ సూపరింటెండెంట్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్

వనపర్తి రూరల్, మే 22: పాలిసెట్ ఈ నెల 24 నిర్వహించనున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం వనపర్తి పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని, పరీక్షలు పకడ్బందీగా నిర్వహించే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. వనపర్తి జిల్లాలో మొత్తం 10 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ముగ్గురు రూట్ ఆఫీసర్లను, ప్రతీ పరీక్షా కేంద్రానికి ఒకరు చొప్పున పది మంది అబ్జర్వర్లను నియమించామని తెలిపారు. మొత్తం 10 పరీక్షా కేంద్రాలకు గాను 2,394 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి ఒక గంట ముందే చేరుకోవాలని సూచించారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

అచ్చంపేట, మే 22: విద్యుదాఘాతంతో ఓ దినసరి కూలీ మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని వేంకటేశ్వర నగర్ కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బల్మూరు మండల కేంద్రానికి చెందిన అరెకంటి రాములు(40) గత కొన్ని రోజులుగా అచ్చంపేట పట్టణంలోని వేంకటేశ్వర నగర్ కాలనీలో నివసిస్తూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం కాలనీలో వేపకొమ్మలు తొలగించే పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలు తగిలి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడి భార్య కాశమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ నాగేందర్ తెలిపారు.

ఇంట్లో చోరీ

కోస్గిరూరల్, మే22: నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలోని బీసీ కాలనీ సమీపంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీసీ కాలనీలోని బిజ్జారం అంజిలమ్మ, భర్త హన్మంతు ఇంట్లో నిద్రిస్తుండగా తలుపులు సరిగా మూయకపోవడంతో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ. 80వేల నగదును అపహరించుకొని వెళ్లారు. బుధవారం ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసు క్లూస్‌టీం సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

భవనంపై నుంచి జారి పడి కార్మికుడి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, మే 22 : నిర్మాణంలో ఉన్న భవనంపై పని చేస్తున్న భవన నిర్మాణ కార్మికుడు వడ్డె మల్లేష్(42) కాలుజారి పడి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డుకాలనీలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... మునిసిపాలిటీ పరిధిలోని ఎండబెట్ల గ్రామానికి చెందిన వడ్డె మల్లేష్ తాపి మేస్త్రీగా భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. బుధవారం నాగర్‌కర్నూల్ హౌసింగ్‌బోర్డు వెంకటేశ్వరస్వామి దేవాలయం పక్కన నిర్మిస్తున్న ఐదంతస్తుల భవనం పిల్లర్లకు గోనె సంచులను ఏర్పాటు చేస్తుండగా ఒక్కసారిగా కాలుజారి నాల్గవ అంతస్తుపై ఉన్న మెట్లపై పడ్డాడు. గమనించిన ఇంటి యజమానులు నాగర్‌కర్నూల్ జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలిస్తుండగా మృతి చెందాడు. ప్రభుత్వపరంగా బాధితులను ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు. ఈ సంఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

భక్తిశ్రద్ధలతో కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు



పంచామృత అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

» లక్ష్మీనరసింహ స్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి

తాడూరు, మే 22 : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని సిర్సవాడ గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు మూడు రోజులుగా భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం స్వామి వారికి అభిషేకం అనంతరం ప్రత్యేక హోమం నిర్వహించి శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవోపేతంగా జరిగింది. స్వామి అమ్మవార్లకు మొదటగా అర్చకులు జీలకర్ర బెల్లం పెట్టి ఒకే మండపంలో కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. అనంతరం భక్తులందరికీ అన్నప్రసాదాలను అందజేశారు. ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డి హాజరై స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఇదే కల్యాణ వేడుకకు బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ హాజరయ్యారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో గ్రామంలోని పురవీధుల గుండా పల్లకిసేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం జరగనుంది. సాయంత్రం ఆలయం చుట్టూ బండ్ల ప్రదక్షిణ నిర్వహించనున్నట్లు అర్చకుడు జగదీశ్వర్ తెలిపారు.



కల్యాణానికి హాజరైన భక్తులు

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

» కల్వకుర్తిలో డీసీఎంను ఢీకొన్న బొలెరో వాహనం » ఇద్దరి పరిస్థితి విషమం





నవాబ్‌పేట మండలం కొల్లూరు వద్ద స్తంభాన్ని ఢీకొన్న ఆటో; ఆటోని ఢీకొన్న లారీ

కల్వకుర్తిటౌన్, మే 22: బొలెరో డీసీఎం వాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం పురపాలిక పరిధిలోని జేపీనగర్ వద్ద చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. చారకొండ మండలం తుర్కలపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు, రమేష్, శ్యామలమ్మలు ఒకే కుటుంబానికి చెందిన వారు. వారు తుక్కుగూడ వద్ద ఓ వ్యాపారి వద్ద పనిచేసేవారు. డబ్బులు ఇవ్వకపోవడంతో అతడికి చెందిన బొలెరో వాహనం తీసుకొని తమ సొంతగ్రామం తుర్కలపల్లికి వెళుతున్న క్రమంలో జేపీనగర్ వద్ద వాహనం అదుపుతప్పి, ఎదురుగా వస్తున్న డీసీఎం వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదం జరిగిన సమయంలోనే దేవరకొండకు చెందిన కాలు, దస్రు, బిలియా, నీల, రూని, స్వాతిలు మద్దిమడుగులోని ఆంజనేయస్వామిని దర్శించుకొని హైదరాబాద్‌కు వెళ్తున్న వారి వాహనం పక్కనే రహదారి కిందకు వెళ్లి చెట్టుకు ఢీకొని స్వల్పగాయాలైనట్లు వారు తెలిపారు. తీవ్రంగా గాయపడిన ఆంజనేయులు, శ్యామలమ్మలను ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించినట్లు వైద్యసిబ్బంది తెలిపారు.

నవాబ్‌పేటలో ఆటో లారీ ఢీ..

నవాబ్‌పేట: కూలీలు వెళ్తున్న ఆటోను లారీ ఢీకొనడంతో పలువురికి గాయాలయ్యాయి. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్ఐ అభిషేక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కొల్లూర్ గ్రామానికి చెందిన కుక్కల పదమ్మ, గౌరమ్మ, రాములమ్మ, పద్మమ్మ, కావలి లక్ష్మమ్మ, లోకిరేవు పెంటమ్మ, సుకన్య ఆటో డ్రైవర్ వెంకట్‌రెడ్డి అందరూ ఆటోలో బుధవారం ఉదయం కొందుర్గు మండలం మామిడి తోటలో కూలి పనులు చేసేందుకు వెళ్లారు. పనులు ముగించుకొని తిరిగి సాయంత్రం ఇంటికి బయలుదేరారు. గ్రామ సమీపంలోని రైతు వేదిక వద్దకు రాగానే రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం నుంచి నవాబ్‌పేట వైపు వస్తున్న లారీ డ్రైవర్ అజాగ్రత్తతో నడుపుతూ ఆటోను వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో ఆటోలో ఉన్న పలువురు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. అందులో ఓ మహిళ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిపారు. ఇది గుర్తించిన స్థానికులు ప్రైవేటు వాహనంలో అందరినీ మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలానికి ఎస్ఐ అభిషేక్‌రెడ్డి చేరుకొని సంఘటన వివరాలు అడిగి తెలుసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మానవపాడులో ఇద్దరికి..

అలంపూర్ చౌరస్తా: జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని జాతీయరహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు, హైవే సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మానవపాడు మండల కేంద్రానికి చెందిన నరసింహ, భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ద్విచక్రవాహనంపై బుధవారం కర్నూలు వెళ్లారు. తిరిగి గ్రామానికి వస్తుండగా వీ కేర్ కోల్డ్ స్టోరేజీ ఎదురుగా కుక్క అడ్డం రావడంతో బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. ప్రమాదంలో నరసింహకు, కుమార్తె రేవతికి మోస్తరు గాయాలు కాగా, భార్య, మరో కుమార్తెకు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 టెక్నీషియన్ రాధామోహన్, పైలెట్ శేషు అక్కడికి చేరుకుని వారికి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు.



కల్వకుర్తిలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆంజనేయులుకు ప్రథమ చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

నరసింహుడి జయంతి ఉత్సవాలు



చండీ హోమాన్ని నిర్వహిస్తున్న పురోహితులు

తిమ్మాజిపేట, మే 22 : తిమ్మాజిపేట మండల పరిధిలోని అప్పాజీపల్లి శివారులో నరసన్నగుట్టపై స్వయంభువుగా వెలసిన లక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలు బుధవారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహ స్వామికి ప్రత్యేక అభిషేకాలు, స్తంభ పూజలు నిర్వహించి ఘనంగా చండీహోమాన్ని పురోహితులు కృష్ణమూర్తిశర్మ, గంగాధర శర్మ జరిపించారు. అదేవిధంగా సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులు స్వామిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. కొండ ప్రాంతమంతా గోవిందనామస్మరణతో మారుమోగింది. గత రెండు రోజులుగా ప్రథమ వార్షిక ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేసి అన్నదానం చేశారు. అదేవిధంగా వార్షిక పూజల నిర్వహణ సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేసిన దాతలు పాకనాటి శివరంజని, సాయి, చైతన్య, పాకనాటి పూజిత, విష్ణువర్ధన్ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలు కప్పి సన్మానించారు.

20 రోజుల్లో పూర్తి అయ్యేనా ?

» మండలానికి నిధులు మంజూరు » ఐదు రకాల పనులు చేపట్టిన మహిళా సంఘాలు



పుల్వవానిపల్లిలో జరుగుతున్న పనుల

హన్వాడ, మే 22 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ పాఠశాలలో మౌలిక సదుపాయలు కల్పించేందుకు నిధులు మంజూరు చేసింది. అందుకు అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసింది. ఆ కమిటీల ద్వారా జూన్ 12 లోపు అన్ని పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కమిటీలు పనులను ప్రారంభించిన పాఠశాలలు పునఃప్రారంభం నాటికి పూర్తి చేసేటట్లు కనిపించడం లేదు. ఈ నెలాఖరిలోపు పూర్తి చేయాలని మండలంలో పర్యటించిన అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు పనులు పూర్తి చేసేందుకు కొన్ని గ్రామాల పాఠశాలల్లో పనులు జరుగుతున్నాయి. మరికొన్ని గ్రామ పాఠశాలల్లో పనులు అనుకున్న స్థాయిలో జరగడంలేదు. మరుగుదొడ్లు, తాగునీటి ట్యాంకులు, కరెంట్, డోర్లు, కిటికీలు, ఇతర మైనర్ రిపేర్లు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మండలంలోని 37 పాఠశాలల్లో ఐదు రకాల పనులు చేసేందుకు 1,49,65000 రూపాయల నిధులు మంజూరి చేసింది. అందులో ప్రస్తుతం 25 శాతం డబ్బులు కమిటీల ఖాతాల్లో జామ చేశారు. పాఠశాలలో పనిని బట్టి రెండు లక్షల నుంచి 11 లక్షల వరకు నిధులు విడుదల చేశారు. కొన్ని గ్రామాలలో మహిళా సంఘంతో ఏర్పడి కమిటీలను కాదని మేమే చేస్తామని కాంగ్రెస్ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. అక్కడక్కడా ఇలాంటి సమస్యలు ఎదురైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని రాజీ కుదుర్చి పనులు మొదలు చేశారు.

పాఠశాలల ప్రారంభం నాటికి పూర్తి చేస్తాం

మండలంలో 37 పాఠశాలల్లో పనులు మొదలు పెట్టాం. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి పూర్తి చేసే విధంగా రోజూ పర్యటించి పరిశీలిస్తున్నాం. ప్రస్తుతం పనులు వేగంగా జరుగుతున్నాయి. సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

\- రాజునాయక్, ఎంఈవో

నిత్యం పర్యవేక్షిస్తున్నాం

మహిళా సంఘాల సభ్యులతో ఏర్పడిన అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో చేపట్టిన పనులు అనుకున్న సమయానికి పూర్తి చేసేందుకు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నాం. అందరినీ సమన్వయం చేసుకొని పనులు నాణ్యతగా, వేగంగా జరిగేలా చూస్తాం.

\- సుదర్శన్, ఏపీఎం

హార్టికల్చర్ కళాశాల ప్రారంభమయ్యేనా?

» గతేడాది మంజూరైన కళాశాల
» వసతుల లేమితో మోజర్ల యూజీ బీఎస్సీ హార్టికల్చర్ కళాశాలకు తరలింపు



గతేడాది హార్టికల్చర్ పాలిటెక్నిక్ డిప్లొమా కళాశాల కొనసాగింది ఈ పాఠశాలలోనే..

కొల్లాపూర్, మే 22 : కొల్లాపూర్‌లో ఉద్యానవన పాలిటెక్నిక్ డిప్లొమా కళాశాల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన విద్యార్థులకు నిరాశే మిగిలింది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రానికి గతేడాది సెప్టెంబరు నెలల్లో ఉద్యాన, పాలిటెక్నిక్ డిప్లొమా కళాశాల మంజూరు చేయడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేసిన కొన్ని నెలల్లోపే నిరాశే దక్కింది. సెప్టెంబరు నెలలో హడావిడిగా కళాశాలను కొల్లాపూర్ పట్టణంలోని ఆర్ఐడీ పాఠశాల భవనంలో ఒక తరగతి గది, ఒక స్టాఫ్ రూమ్, నలుగురు అధ్యాపకులను కేటాయించి కళాశాలను ప్రారంభించారు. దాదాపు పది మంది విద్యార్థులు కూడా డిప్లొమా కోర్సులో అడ్మిషన్లు కూడా పొందారు. మూడు నెలలు కొల్లాపూర్ పట్టణంలో హార్టికల్చర్, పాలిటెక్నిక్ డిప్లొమా కళాశాల విద్యార్థులకు సరిపడా వసతులు లేవు. క్షేత్ర స్థాయిలో విద్యార్థులకు ప్రాక్టికల్స్ చేయించాల్సి ఉంటుందని పేర్కొంటూ కొత్తకోట దగ్గర మోజర్ల ప్రాంతంలో ఉన్న యూజీ బీఎస్సీ హార్టికల్చర్ కళాశాలలో కొల్లాపూర్ హార్టికల్చర్, పాలిటెక్నిక్ కళాశాలను కొనసాగించారు. అక్కడే విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, ల్యాబ్, ప్రాక్టికల్ వసతులు క్షేత్రస్థాయిలో విద్యార్థులకు ఉద్యానవన పంటలపై అవగాహన కల్పించారు. గత ప్రభుత్వం కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రానికి హార్టికల్చర్, పాలిటెక్నిక్, డిప్లొమా కళాశాలను మంజూరు చేసిన దానికి సరిపడా నిధులు మంజూరు చేయలేదు. కళాశాలకు కావాల్సిన స్థల సేకరణ చేపట్టలేదు. భవన నిర్మాణానికి నిధులు వెచ్చించలేకపోయింది. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు గత పాలకులు తాత్కాలికంగా ఆర్ఐడీ పాఠశాలలో ఒకే తరగతి గదిలో హార్టికల్చర్ కళాశాలను కొనసాగించారు. టెన్త్, ఇంటర్, ఉత్తీర్ణులై 22సంవత్సరాలున్న విద్యార్థులు హార్టికల్చర్, పాలిటెక్నిక్, డిప్లొమా కళాశాలలో నేరుగా అడ్మిషన్లు పొందవచ్చు. ఈ ఏడాది 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి జూన్, జూలైలో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగనుంది. మొదటి సంవత్సరంలో మొత్తం 40సీట్లు అందుబాటులో ఉంటాయి. ఈ ఏడాదైనా మోజర్ల యూజీ బీఎస్సీ కళాశాలకు తరలిన హార్టికల్చర్, పాలిటెక్నిక్ డిప్లొమా కళాశాల కొల్లాపూర్ ప్రాంతానికి తిరిగి వచ్చేనా అని విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. స్థానికంగానే విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి కళాశాలను కొనసాగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవించే కుటుంబాల నుంచి వచ్చే విద్యార్థులు కూడా హార్టికల్చర్ రంగంలో రాణించాలని నూతన పద్ధతుల్లో ఉద్యానవన పంటలు పండించేలా ఆసక్తి కనబరుస్తున్నారు. అయినప్పటికీ కళాశాల స్థానికంగా లేకపోవడంతో వారిలో నిరాశ, నిస్పృహలే నెలకొన్నాయి. ఈ ఏడాదైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలోనే హార్టికల్చర్, పాలిటెక్నిక్ డిప్లొమా కళాశాలకు సరిపడా వసతులు కల్పించాలి.. విద్యార్థులకు ఉద్యానవన విద్యను అందుబాటులోకి తెచ్చేలా కృషి చేయాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

యాపట్ల, చంద్రకల్ గ్రామాల్లో రెడ్‌క్రాస్ సంచార వైద్య సేవలు



వృద్ధులకు మందులను అందజేస్తున్న జిల్లా వైద్యాధికారి సుధాకర్‌లాల్

పెద్దకొత్తపల్లి, మే 22 : మండల పరిధిలోని యాపట్ల, చంద్రకల్ గ్రామాల్లో పెద్దకొత్తపల్లి, వెన్నచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మొబైల్ మెడికల్ యూనిట్ ద్వారా వృద్ధులకు ఉచిత సంచార వైద్య సేవలందించారు. ఈ శిబిరాలను నాగర్‌కర్నూల్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ కే.సుధాకర్‌లాల్, తెలంగాణ రాష్ట్ర రెడ్‌క్రాస్ జనరల్ సెక్రటరీ మదన్‌మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్‌విత్ డిజిబిలిటీస్ సీనియర్ సిటిజన్స్ తెలంగాణ ప్రభుత్వ సహకారంతో వృద్ధులకు ఇంటి వద్దనే సేవలందించేందుకు ఈ సంచార వైద్య సేవలందిస్తుందన్నారు. కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఆదేశాల మేరకు రెడ్‌క్రాస్ సంచార వాహన వైద్య సేవలందిస్తున్నామని వారు పేర్కొన్నారు. యాపట్లలో 60ఏళ్లకు పైబడిన 86మంది వృద్ధులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు తెలిపారు. అలాగే చంద్రకల్ గ్రామంలో 68మంది వృద్ధులకు వైద్య సేవలందించి మధుమేహం, బీపీ పరీక్షలను నిర్వహించి మందులను అందజేసినట్లు పేర్కొన్నారు. మొబైల్ మెడికల్ యూనిట్ రాష్ట్ర కో ఆర్డినేటర్ స్వర్ణలత, వైద్యాధికారి డాక్టర్ విజయ్, రెడ్‌క్రాస్ సెక్రటరీ సి.రమేష్‌రెడ్డి, జిల్లా యూత్ రెడ్డి క్రాస్ కన్వీనర్ డి.కుమార్, మేనేజింగ్ కమిటీ సభ్యులు కృష్ణారావు, నారాయణ, సీహెచ్‌వో వెంకటశ్రీనివాస్, సూపర్‌వైజర్ బాలాజీ, జ్యోతి, సురేష్, ఏఎస్‌ఎం, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు జరగాలి



కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ సీతారామారావు

కల్వకుర్తి, మే 22: వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వరిని కొనుగోలు చేయాలని అడిషనల్ కలెక్టర్ సీతారామారావు కోరారు. కల్వకుర్తి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ ఇబ్రహీంతో కలిసి అడిషనల్ కలెక్టర్ సీతారామారావు పరిశీలించారు. ఈ సందర్భంగా వరిని పరిశీలించారు. రైతులు వరిని మంచిగా ఆరబెట్టి తీసుకురావాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఏ రోజు ధాన్యాన్ని అదే రోజు లోడ్ చేసి పంపించాలని ఆదేశించారు.

ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి



భాగ్యరెడ్డివర్మ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న అంబేద్కర్ ఐడియాలజీ మిషన్ సభ్యులు

నాగర్‌కర్నూల్ టౌన్, మే 22: దళితుల ఆత్మగౌరవం కోసం పోరాటం చేసిన భాగ్యరెడ్డి వర్మ జయంతిని అంబేద్కర్ ఐడియాలజీ మిషన్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఓ ప్రైవేటు మందిరంలో ఏర్పాటు చేసిన భాగ్యరెడ్డి వర్మ చిత్ర పటానికి మిషన్ అధ్యక్షుడు టి.మద్దిలేటి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్కన్ పీఠభూమిపై భాగ్యనగరంలో జన్మించి ఈ ప్రాంత సామాజిక ఉద్యమాల తొలి గురువు భాగ్యరెడ్డి వర్మ అని కొనియాడారు. మద్దిలేటి, చెన్నయ్య, నరసింహ, మంజుల, శివలీల, శ్రీను, రమేష్, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చింత సత్తి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఖననం చేసిన శవం వెలికితీత

- కుటుంబ సభ్యులకు అప్పగింత

కొల్లాపూర్, మే 22 : సరిగ్గా ఏడు రోజుల క్రితం గుర్తు తెలియని మహిళ శవంగా భావించి మునిసిపాలిటీ ఆధ్వర్యంలో కొల్లాపూర్ పట్టణంలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. మంగళవారం మృతురాలి కుటుంబ సభ్యులు సోషల్ మీడియాలో వైరల్ అయిన గుర్తు తెలియని ఫొటోను గుర్తించి మా అమ్మేనంటూ పోలీసులకు లిఖితపూర్వకంగా మొరపెట్టుకున్నారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 12వ తేదీన కొల్లాపూర్ పట్టణానికి చెందిన ఆసీఫా బేగం(60) కొల్లాపూర్ పట్టణం నుంచి సింగోటం వెళ్లింది. 13న సింగోటం శ్రీవారి సముద్రంలో పోలీసులకు ఆసీఫాబేగం మృతదేహం లభ్యం కావడంతో పోలీసులు సోషల్ మీడియాలో మృతురాలి ఫోటోను వైరల్ చేశారు. 15వ తేదీ రోజు పోస్టుమార్టం నిర్వహించి మృతురాలి శవాన్ని మునిసిపాలిటీకి అప్పజెప్పడంతో కొల్లాపూర్ పట్టణంలోని శ్మశాన వాటికలో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో శవాన్ని ఖననం చేశారు. సరిగ్గా 7రోజుల తర్వాత శవంగా మారింది తమ అమ్మేనని కొడుకు ఎండి.జాఫర్ పోలీసుల ముందు పేర్కొని శవాన్ని తమకు అప్పజెప్పాలని కోరాడు. బుధవారం కొల్లాపూర్ తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్‌ఐ రిషికేష్‌ల సమక్షంలో మృతురాలి శవాన్ని వెలికితీసి కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. బుధవారం కుటుంబీకులు ముస్లిం సాంప్రదాయ పద్ధతుల్లో అంత్యక్రియలు నిర్వహించారు.

ఉమ్మాపూర్-డిండి బస్సును పునరుద్ధరించాలి

వంగూరు, మే 22: రద్దు చేసిన ఉమ్మాపూర్-డిండి బస్సును వెంటనే పునరుద్ధరించాలని బీసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం కల్వకుర్తి ఆర్టీసి డిపో ఇంచార్జిని కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన వంగూరులో విలేకర్లతో మాట్లాడుతూ ఎంతో సౌకర్యంగా ఉన్న ఉమ్మాపూర్-డిండి బస్సును గత నెల ఏప్రిల్ 23 నుంచి బస్సును రద్దు చేయడంతో సామాన్య ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్సుప్రయాణం మహిళలు, యువతులు, విద్యార్థినులు వినియోగించుకోవడం లేదన్నారు. వంగూరు మండల కేంద్రానికి అదనపు బస్సులను కూడా నడిపేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ శ్రీనివాస్ యాదవ్, అనిల్, ప్రసాద్, వెంకటేష్, విష్ణు పాల్గొన్నారు.

ఎంఎంఎస్‌వీవోల పని తీరుపై తనిఖీలు

కోడేరు, మే 22 : మండల మహిళా సమాఖ్య గ్రామ మహిళా సంఘాల పనితీరుపై వార్షిక నివేదికలపై ఆడిట్ నిర్వహించారు. బుధవారం మండల కేంద్రంలోని మండల మహిళా సంఘం కార్యాలయంలో మండల ఏపీఎం పార్వతమ్మ సమక్షంలో ఆడిటర్లు సురేష్, భార్గవ్‌లు మండల సమాఖ్య గ్రామ సంఘాల పనితీరు వార్షిక నివేదికలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం పార్వతమ్మ మాట్లాడుతూ మండలంలో స్త్రీనిధి కింద రుణం ఇవ్వడానికి లక్ష్యం పెట్టుకోగా రెండు కోట్ల రుణం ఇచ్చినట్లు, ఇక మండల మహిళా సమాఖ్య ద్వారా గ్రామ సంఘాలకు 14 లక్షల రూపాయలు కోడేరు, తీగలపల్లి, పస్పుల, మాచుపల్లి, రేకులపల్లి, రాజాపూర్, ఎత్తం గ్రామాలకు ఇచ్చినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 23గ్రామ సంఘాలు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు బ్యాంకులు, స్త్రీనిధి, ఎంఎంఎస్ నుంచి పొందిన రుణాలను రీపేమెంట్ చేస్తూ ప్రభుత్వం నుంచి ఇచ్చిన పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నారని ఆమె అన్నారు.

రామాంజనేయ దేవాలయంలో తొలి వార్షికోత్సవం

లింగాల, మే 22 : మండల పరిధిలోని దారారం గ్రామంలో రామాంజనేయ దేవాలయంలో బుధవారం తొలి వార్షిక వేడుకలను వైభవంగా నిర్వహించారు. గతేడాది నూతనంగా ఆలయాన్ని నిర్మించి వివిధ దేవతామూర్తుల విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. అందులో భాగంగా మొదటి వార్షికోత్సవాల్లో భాగంగా ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య భక్తులు తిలకిస్తుండగా గ్రామంలో శుభం చేకూర్చాలని కోరుతూ భక్తులచే హోమం జరిపించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయంలో పూజలు, అభిషేకాలు జరిపించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కవిత, శ్రీనివాసులు, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, ఆశోక్‌రెడ్డి, డాక్టర్ నాకల శంకర్‌బాబు, శ్రీశైలంగౌడ్, మంగ్యానాయక్, నాగయ్య మహేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మన ఊరు మన బడి పనులు పూర్తయ్యేనా?

- అసంపూర్తి భవనాల్లోనే విద్యాబోధన
- చదువు కోసం అవస్థలు పడుతున్న విద్యార్థులు
- రెండేళ్లయినా ప్రారంభం కాని పనులు

ఉప్పునుంతల, మే 22: మరో 20 రోజుల్లో పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. నిధుల కొరతతో ఏళ్లు గడుస్తున్నా మన ఊరు మన బడి పథకంలో పాఠశాలల భవన నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో విద్యార్థులు అవస్థలతో విద్యాబోధన కొనసాగిస్తున్నారు. తమకు పట్టనట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

మండలంలో 42 పాఠశాలలు ఉండగా, జడ్పీహెచ్ఎస్ నాలుగు, ప్రాథమికోన్నత పాఠశాలలు ఏడు, ప్రాథమిక పాఠశాలలు 30, కేజీబీవీ ఒకటి ఉన్నాయి. గత ప్రభుత్వం 2022 సంవత్సరంలో మన ఊరు మన బడి పథకంలో 13 పాఠశాలల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేశారు. పెద్దాపూర్, పెనిమిళ్ల, ఉప్పరిపల్లి, ఉప్పునుంతల బాలుర ప్రాథమిక పాఠశాలలు పూర్తి కాగా, అరకొర నిధులతో యూపీఎస్ తాడూరు, అయ్యవారిపల్లి, లత్తీపూర్, మామిళ్లపల్లి, పీఎస్ బాలికల ఉప్పునుంతల, కంసానిపల్లి, ఈర్వటోనిపల్లి గ్రామాల్లోని పాఠశాలల భవన నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. జడ్పీహెచ్ఎస్ ఉప్పునుంతల, యూపీఎస్ లక్ష్మాపూర్ పాఠశాల ప్రారంభం కాలేదు. కార్పొరేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వం పాఠశాలలు అభివృద్ధి చేసి పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో ప్రభుత్వం బడుల దుస్థితి అగమ్య గోచరంగా తయారైందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

13 ప్రభుత్వ బడుల అభివృద్ధి కోసం అరకొర నిధులు మంజూరు అయినా అధికారుల అలసత్వం తోడై విద్యార్థులకు శాపంగా మారిందని తల్లిదండ్రులు వాపోతున్నారు. రెండేళ్ల క్రితం పాఠశాలలు ప్రారంభం సమయంలో మన ఊరు మన బడి కింద భవనాల నిర్మాణం కోసం మండల పరిధిలోని అయ్యవారిపల్లి, లత్తీపూర్ గ్రామాల్లో పాత పాఠశాల భవనాలను కూల్చి నిర్మాణాలు పూర్తి చేయకపోవడంతో ఇప్పటికీ చెట్ల కింద, అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ ప్రజల ఇళ్లలో విద్యాబోధనతో కాలం వెళ్లదీస్తున్నారు. వేసవి సెలవులు పూర్తి కావస్తున్నా పనుల ఊసే ఎత్తకపోవడం.. వచ్చే విద్యా సంవత్సరంలోనైనా పాఠశాలల భవన నిర్మాణాలు పూర్తి అవుతాయా అనే సందేహం కల్గుతున్నది.



లత్తీపూర్‌లో అసంపూర్తిగా చేపట్టిన మన ఊరు మన బడి భవన నిర్మాణం



అయ్యవారిపల్లిలో విద్యార్థుల ఇంటి వద్ద చదువు చెబుతున్న ఉపాధ్యాయురాలు(ఫైల్)

● భవన నిర్మాణం పూర్తి చేస్తే బాగుంటది

కొత్త బడి కడుతామని ఉన్న బడిని కూలకొట్టిండ్రు.. ఇంత వరకు బడి కట్టలేదు.. చదువుకొనికే ఇబ్బంది అవుతుంది.. ప్రతి రోజు గోడనీడలు, చెట్లనీడలో చదువుకొంటున్నాం. అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువు వెళ్లదీస్తున్నాం.

- మోక్ష 5 తరగతి విద్యార్థి, లత్తీపూర్



● ప్రభుత్వమే బడి కట్టించాలి

పాత పాఠశాలను కూల్చి రెండేళ్లు అవుతున్నది. కానీ అరకొర నిధులతో పాఠశాల భవనం అసంపూర్తిగా మిగిలిపోయింది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి నిధులు విడుదల చేయాలి

- మల్లేష్, మాజీ సర్పంచ్, లత్తీపూర్



● నిధుల కొరతతో భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి

నిధులు లేక మన ఊరు మన బడి నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. రెండు పాఠశాలల భవన నిర్మాణాలు ప్రారంభం కాలేదు. నిర్మాణాలు చేపట్టడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అసంపూర్తిగా మిగిలి పోయిన పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

- రామారావు, మండల విద్యాధికారి, ఉప్పునుంతల

పునరావాస గ్రామాల ఏర్పాటుకు సహకరిస్తా

- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

దోమలపెంట, మే 22: నల్లమల అటవీ ప్రాంతం అమ్రాబాద్ అభయారణ్య ప్రాంతంలో ఉన్న వటవర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతలబావి, కొల్లం, కొమ్మనపెంట, తాటిగుండాల గ్రామాలను స్వచ్ఛంద పునరావాస (ఎన్‌టీసీఏ) పథకంలో భాగంగా మైదాన ప్రాంతాలకు తరలించేందుకు అటవీశాఖ కసరత్తు చేస్తున్నది. ఇందుకుగాను బుధవారం వటవర్లపల్లి గ్రామస్థులు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను ఆయన నివాసంలో కలిసి తమ గ్రామాల ఏర్పాటుతో పాటు అభివృద్ధికి సహకరించాలని గ్రామస్థులు కోరారు.

పునరావాస గ్రామాల తరలింపు ప్రక్రియ తన దృష్టికి వచ్చిందని, గ్రామం విడిచి వెళ్లేవారికి తనవంతు సహకారం ఉంటుందని, గ్రామంలో ఉన్నవారికి కూడా అండగా ఉంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారి నిర్మాణం కొరకు మన్ననూర్ నుంచి శ్రీశైలం వరకు కారిడాల్ రోడ్డు నిర్మాణం కొరకు కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిందన్నారు. త్వరలోనే అనుమతులు రావచ్చని ఆయన పేర్కొన్నారు. త్వరలో వటవర్లపల్లిలో జరుగనున్న పునరావాసం గ్రామసభకు వస్తానని, అన్ని విషయాలు అటవీశాఖ అధికారులతో చర్చిస్తానని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. పునరావాస గ్రామ కమిటీ అధ్యక్షుడు సాయిబాబు, మాజీ సభ్యులు చత్రునాయక్, జూల్యానాయక్, సభ్యులు బాలకృష్ణ, మక్బూద్, జానకిరాములు, సాదిక్, కర్నాటి శ్రీనువాస్, శ్రీను, నిరంజన్, లక్ష్మణ్‌రాజు, జైపాల్, సూర్యం, కరీం, కుమార్, విష్ణు, ప్రవీన్ తదితరులు ఉన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యం

ఉప్పునుంతల: అచ్చంపేట నియోజకవర్గాన్ని విద్య, వైద్య ఇరిగేషన్ ఇండస్ట్రీలో అభివృద్ధి చేయడమే లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. బుధవారం ఉప్పునుంతలలోని రైతు వేదికలో ఎంపీపీ తిప్పర్తి అరుణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు ఎజెండా చదివి వినిపించారు. ఈ సందర్భంగా పెనిమిల్ల, మామిళ్లపల్లి గ్రామంలో పశు వైద్య సబ్ సెంటర్ మంజూరు చేయాలని ఎంపీటీసీ సభ్యుడు సంబు భాస్కర్ సభ దృష్టికి తీసుకవచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీటి సమస్య లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ హేమలతకు సూచించారు. ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ బిల్లులు త్వరితగతిన అందించాలని ఏపీవో సుదర్శన్‌గౌడ్ అన్నారు. మండలంలో అసంపూర్తిగా ఉన్న ఆరు గ్రామపంచాయతీ భవనాలను పూర్తి చేసే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. మాజీ మంత్రి మహేంద్రనాద్ ఆదర్శంగా తీసుకొని ప్రజా సేవ చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఎంపీ రాములు సలహాలు సూచనలు తీసుకొని ప్రజా సేవలో 24 గంటలు పని చేస్తామన్నారు. జూన్ 5, 6వ తేదీలలో అచ్చంపేట ఏరియా ఆసుపత్రిలో 24 రకాల ఆపరేషన్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశానికి హాజరు కాని అధికారులకు షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఎంపీడీవోకు ఆయన సూచించారు.

● పార్టీలకతీతంగా నియోజకవర్గ ప్రజలు నా వాళ్లేనని, ఎమ్మెల్యే వంశీకృష్ణ పని చేసి ప్రజల మన్ననలు పొందాలని ఎంపీ రాములు అన్నారు. గత 10 సంవత్సరాలుగా ఆసుపత్రులలో పేద ప్రజలకు వైద్యం అందక ఎంతోమంది మృత్యువాత పడుతున్నారని ఆయన గుర్తు చేశారు. దుందుబీ వాగులో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని, అదేవిధంగా రెవెన్యూశాఖలో పేదలకు భూ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అవినీతికి చరమగీతం పాడాలన్నారు.

● జూన్ 4 తేదీన ఎంపీ పదవీ కాలం ముగుస్తుండంతో పోతుగంటి రాములుకు మండల సర్వసభ్య సమావేశం అనంతరం ఎమ్మెల్యే వంశీకృష్ణ శాలువా కప్పి సన్మానం చేశారు. జడ్పీటీసీ సభ్యుడు అనంతప్రతాప్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ భూపాల్‌రావు, ఎంపీడీవో లక్ష్మణ్‌రావు, తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



అచ్చంపేటలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను కలిసిన వటువర్లపల్లి గ్రామ పునరావాస సభ్యులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



శివుడి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న భవన నిర్మాణ తాపీ మేస్త్రీలు

పెద్దకొత్తపల్లి, మే 22 : మండల పరిధిలోని వెన్నచెర్ల గ్రామంలో మద్దని శ్రీనివాసులు కుమారుడు మద్దని శివుడు ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అనుచరులు, శ్రీవేంకటేశ్వర భవన నిర్మాణ తాపీ మేస్త్రీలు బాధిత కుటుంబ సభ్యుల్ని సందర్శించి మృతుడి మృతదేహంపై పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను ఎంపీపీ అనుచరులు, శ్రీవేంకటేశ్వర భవన నిర్మాణ తాపీ మేస్త్రీలు 22 వేల నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. మద్దిలేటి, తిరుపతయ్య, బావిరాజు, రామకృష్ణ, శివ, సైదులు, శ్రీను, శేఖర్, సత్యనారాయణ, రాముడు, చంద్రయ్య, ఆనంద్, పి.నాగరాజు, జనార్దన్, చిన్నసాయిలు, కుర్మయ్య, ఎల్లయ్య, సలేశ్వరం, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

మల్లురవి గెలుపొందాలని గుల్బర్గా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎండి.జాంగీర్

పెద్దకొత్తపల్లి, మే 22 : నాగర్‌కర్నూల్ ఎంపీగా డాక్టర్ మల్లురవి భారీ మెజార్టీతో గెలుపొందాలని గుల్బర్గా దర్గాలో యాపట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కో ఆప్షన్ మాజీ మెంబర్ ఎండి.జాంగీర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. డాక్టర్ మల్లురవి నాగర్‌కర్నూల్ ఎంపీగా భారీ మెజార్టీతో గెలుపొందాలని కర్ణాటకలోని గుల్బర్గా హజ్రత్ ఖాజా బందేనవాజ్ దర్గాలో ప్రార్థనలు నిర్వహించారు. పాష, అయూబ్, బాలేసాబ్, ఇర్ఫాన్, ఖదీర్, సాజిద్ పాల్గొన్నారు.

నిర్మాణాలు చేపడితే చర్యలు

కొల్లాపూర్, మే 22 : కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలో మునిసిపల్ శాఖ అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా శాఖపరమైన చర్యలు తప్పవని మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసన్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలో ఉన్న 20వార్డుల్లో గృహ సముదాయాలు, వ్యాపార సముదాయాలు నిర్మాణాలు చేపట్టే వారు తప్పనిసరిగా మునిసిపల్ శాఖ అనుమతులు పొందాక నిర్మాణాలు చేపట్టాలని, నిబంధన అతిక్రమించిన వారిపై శాఖపరమైన చర్యలు తప్పక ఉంటాయని మునిసిపల్ కమిషనర్ వెల్లడించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

కల్వకుర్తి, మే 22 : కల్వకుర్తి మండలం జిల్లెల గ్రామానికి చెందిన కృష్ణయ్య రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తలకొండపల్లి జడ్పీటీసీ, ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్ మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం సమకూర్చారు. దీంతో బుధవారం బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. నాయకులు కిశోర్, మహేష్, ఆనంద్, విష్ణు, కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఘనంగా నోముల జంగయ్య వర్ధంతి

ఉప్పునుంతల, మే 22: మండల పరిధిలోని రాయిచేడు గ్రామంలో బుధవారం నోముల జంగయ్య మూడవ వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా జంగయ్య స్మారక స్థూపం వద్ద పూలమాలతో ఘన నివాళుల్పరించారు. సీపీఎం నాయకులు చంద్రయ్య, చింతల నాగరాజు, మల్లేష్, వెంకటయ్య, మల్లయ్య, సాయిలు, శ్రీను, సాయిబాబు ఉన్నారు.

గాలికుంటు నివారణకు టీకాలు తప్పనిసరి

తిమ్మాజిపేట, మే 22: పశువుల్లో సోకే గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించడం తప్పనిసరి అని పశు వైద్యాధికారి డాక్టర్ శివరాజ్ అన్నారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని రాళ్లచెరువుతండాలో బుధవారం ఇందిరా ప్రియదర్శిని నాబార్డు సంస్థ ఆధ్వర్యంలో పాల ఉత్పత్తిపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామాల్లో శిబిరాలు నిర్వహించి హెచ్ఎస్ వ్యాక్సిన్ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. ఇందిరాప్రియదర్శిని డైరెక్టర్ గోవర్ధిని పాల్గొన్నారు.

నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

చారకొండ, మే 22: మండలంలోని గ్రామాల్లో నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీవో వెంకటేష్ అన్నారు. బుధవారం మండలంలోని మర్రిపల్లి, గోకారం, చంద్రాయన్‌పల్లిలో పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఎంపీవో వెంకటేష్ నర్సరీలు, వైకుంఠధామాలు, కంపోస్ట్ షెడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తుండడంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. నర్సరీలో పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించి చనిపోయిన మొక్కల స్థానంలో బ్యాగుల్లో కొత్త విత్తనాలు నాటాలని అన్నారు. కార్యదర్శులు రవిశంకర్, చెన్నకేశవులు, శ్రీఫణి పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన స్కూల్ యూనిఫాం వస్త్రం

- కుట్టించేందుకు మండలాలకు పంపిణీ
- జిల్లాలో మొత్తం 60,423 మంది విద్యార్థులు

నాగర్‌కర్నూల్ టౌన్, మే 22: జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వం ఉచితంగా అందించే యూనిఫాంకు సంబంధించిన వస్త్రాలు జిల్లాకు చేరాయి. ప్రతీ విద్యార్థికి ఒక జత ఏకరూప దుస్తులు కుట్టించేందుకు మొత్తం 31,32,332 మీటర్ల గుడ్డ జిల్లాకు చేరుకుంది. జిల్లా కేంద్రంలోని నేషనల్ హైస్కూల్‌లో వస్త్రాల బండిళ్లను భద్రపరిచారు. మండలాల వారిగా వస్త్రాలను పంపిణీ చేసి, ఎంపిక చేసిన స్వయం సహాయక మహిళా సంఘాల ఆధ్వర్యంలో యూనిఫాంలు కుట్టించేందుకు జిల్లా విద్యాశాఖ, డీఆర్‌డీఏ శాఖల అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ విద్యా సంవత్సరంలో తరగతుల వారిగా విద్యార్థులకు వేర్వేరు నమూనాల్లో యూనిఫాంలు కుట్టించేందుకు రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు మార్గదర్శకాలను జారీ చేశారు. తప్పనిసరిగా అదే మాడల్‌లో యూనిఫాంలను కుట్టించి విద్యార్థులకు అందించాలని రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ప్రస్తుతం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి 8వ తరగతుల వరకు మొత్తం 46,529 మంది విద్యార్థులు ఉన్నారు. అలాగే తొమ్మిది, పది తరగతుల్లో 12,418 మంది విద్యార్థులు ఉన్నారు. అదేవిధంగా కేజీబీవీ, మోడల్ స్కూల్స్‌లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 1,476 మంది ఉన్నారు.

● మహిళా సంఘాలకు కుట్టించే బాధ్యతలు

నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల స్కూల్ యూనిఫాం కుట్టించే బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించారు. ఇందుకోసం ఆసక్తి ఉన్న సంఘాలను ఆహ్వానించి టెండర్లు ఖరారు చేయాల్సి ఉంటుందని తెలిపారు. స్కూల్ యూనిఫాం కుట్టించే బాధ్యతను తీసుకున్న సహాయక సంఘాలను డీఆర్‌డీఏ పర్యవేక్షనుంది.



స్కూల్ యూనిఫాం వస్త్రాలను పరిశీలిస్తున్న డీఈవో గోవిందరాజులు

● తొలి రోజే అందించేందుకు కృషి

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్ విద్యార్థులకు ఒక ఏకరూప దుస్తులు ఒకేరోజు పాఠశాల పునఃప్రారంభమయ్యే దినం జూన్ 12న విద్యార్థులకు అందించేందుకు ఏర్పాటు చేస్తున్నాం. మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించి యూనిఫాం కుటించి అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

- గోవిందరాజులు, జిల్లా విద్యాధికారి

నేడు రామాలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

కందనూలు, మే 22: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో గల శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఈ నెల 23న గురువారం ఉదయం 10:30 గంటలకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు భక్తులచే నిర్వహిస్తున్నట్లు రామాలయ ప్రధాన అర్చకుడు కందాడై వరదరాజన్ అయ్యంగార్ తెలిపారు. పౌర్ణమి రోజు ప్రత్యేకంగా వ్రతాలు నిర్వహించి అనంతరం తీర్థ ప్రసాదాలతోపాటు రామాలయం అన్న ప్రసాద కమిటీ వారిచే మధ్యాహ్నం 1గంటకు అన్నప్రసాద వితరణ పాల్గొన్న భక్తులందరికీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

● ఓంనగర్ కాలనీలో....

జిల్లా కేంద్రంలోని ఓంనగర్ కాలనీలో పాత రవితేజ కాలేజ్ వెనక గల శ్రీపబ్బతి అంజనేయస్వామి దేవాలయంలో వైశాఖ శుద్ధపౌర్ణమి పురస్కరించుకుని నేడు ఉదయం 7:30గంటలకు సామూహిక గోపూజ అనంతరం పరమశివునికి సామూహిక రుద్రాభిషేకం, పూజలు భక్తులచే నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు మాడభూషి అజయ్‌కుమార్‌శర్మ తెలిపారు. పాల్గొనే భక్తులు తమ వెంట గోమాతకు, పూజకు సంబంధించిన పూజా సామగ్రి వెంట తెచ్చుకోవాలని సూచించారు.

లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నరసింహస్వామి జయంతి

నాగర్‌కర్నూల్ పట్టణంలోని కొల్లాపూర్ చౌరస్తాలో శ్రీభక్త లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నరసింహ జయంతిని బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష అభిషేకాలు, పూజలు అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. దేవాలయం యొక్క పుస్తకాన్ని గురుమాత కాశంశెట్టి విజయలక్ష్మి ఆవిష్కరించి దేవాలయానికి వచ్చిన భక్తులందరికీ ఉచితంగా పుస్తకాన్ని అందజేశారు. భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పెద్దకొత్తపల్లి, మే 22 : మండల పరిధిలోని నారాయణపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ప్రకాశ్‌గౌడ్ మాతృమూర్తి శ్యామలమ్మ ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి నారాయణపల్లి గ్రామంలోని మృతురాలి కుటుంబాన్ని సందర్శించి పరామర్శించి ప్రగాఢ సంతాపం వెలిబుచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు గుజ్జుల పరమేశ్, బెట్టరి నాగరాజు, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

నాగర్‌కర్నూల్ క్రైం, మే 22 : కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ బుధవారం హెచ్చరించారు. జిల్లాలో కల్తీ విత్తనాలను అరికట్టేందుకు 10మంది పోలీస్ అధికారులతో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో రైతులకు కల్తీ విత్తనాలు అమ్మకుండా కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం నిఘాను ఏర్పాటు చేసి ఆయన తెలిపారు. ఈ ప్రత్యేక బృందాలు జిల్లాలోని వ్యవసాయ అధికారులతో కలిసి ఫర్టిలైజర్, విత్తనాల దుకాణాలను తనిఖీలు చేసి నాణ్యమైన విత్తనాలను రైతులకు అందేవిధంగా చర్యలు తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఒకవేళ కల్తీ విత్తనాలు రైతులకు అమ్మినట్లు రుజువైతే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కల్తీ విత్తనాలపై నిఘా ఉంచేందుకు ఏర్పాటు చేసిన బృందాలు సీసీఎస్ సీఐ శంకర్ ఆధ్వర్యంలోని బృందం వంగూరు ఎస్‌ఐ మహేందర్, తాడూరు ఎస్‌ఐ మహేష్, లింగాల ఎస్‌ఐ జగన్మోహన్ రెడ్డితో పాటు మరికొంత మంది పోలీసులు ఉంటారని ఆయన పేర్కొన్నారు. రైతులంతా జాగ్రత్తగా వ్యవహరించి నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసి పంటలు సాగు చేసుకుని మోసాలకు గురి కావద్దని ఆయన పేర్కొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

పెద్దకొత్తపల్లి, మే 22 : గ్రామంలోని ప్రజలు ఘర్షణలకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్నకార్పాముల గ్రామాన్ని ఆయన సందర్శించి ఇటీవల కాంగ్రెస్ నాయకులు బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులపై దాడి చేసిన సంఘటనపై విచారించారు. గ్రామంలోని గ్రామపంచాయతీ దగ్గరకు ఇరువర్గాల వారిని రప్పించి సంఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. బీజేపీ, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కొల్లాపూర్ సీఐ మహేష్, పెద్దకొత్తపల్లి పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

● చారకొండ: మండలంలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని ఎస్‌ఐ రాజశేఖర్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామాల్లో అపరచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అరికట్టవచ్చని సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు సహకరించాలని కోరారు. ఆన్‌లైన్, సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలి

కల్వకుర్తి, మే 22 : గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా గ్రామ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని కల్వకుర్తి ఎంపీడీవో వెంకట్రాములు కోరారు. కల్వకుర్తి మండల పరిధిలోని తర్నికల్, తర్నికల్‌తాండా, వేపూర్ గ్రామాలను బుధవారం ఎంపీడీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీల్లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఈజీఎస్ పనులను పరిశీలించి కూలీలతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.